ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3 ; కనిష్ఠం 25.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 27 జూన్ 2024

మూడు ప్రైవేట్ బస్సులు సీజ్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 26 : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మూడుప్రైవేట్ బస్సులను ఆర్టీవో అధికారులు సీజ్‌చేశారు. జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం ఆదిలాబాద్‌లో అధికారులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ప్యాసింజర్ బస్సుల్లో సరుకులను సరఫరా చేయడంతో డైమండ్, మెట్రో, సహార ప్రైవేట్ బస్సులను సీజ్ చేసినట్లు ఏఎంవీఐ హరిచంద్ర కుమార్ తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది ఖలీం పాల్గొన్నారు.

వన్యప్రాణుల.. వేట



ఆదిలాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి)

జిల్లా అడవుల్లో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏటా ఎన్నో వన్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి బలవుతున్నాయి. తాజాగా గుడిహత్నూర్ మండలం సీతాగొంది అడవుల్లో నీలుగాయిని చంపి ఈడ్చుకెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం కలకలం రేపుతోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువవడంతోనే తరచుగా వన్యప్రాణుల వేట ఘటనలు వెలుగు చూస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలోనూ ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి అడవుల్లో వన్యప్రాణులను హతమార్చిన దాఖలాలు ఉన్నాయి. అప్పట్లో వేటగాళ్ల పై కేసులు నమోదు చేసిన అధికారులు నామమాత్రంగానే చర్యలు తీసుకోవడంతో మళ్లీ అలాంటి ఘటనలే పునరావృతమవుతున్నాయి. ఇటీవల తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లో చిరుతపులి సంచారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే రెండు మూడు ఆవులపై దాడి చేసి హతమార్చిన ఘటనలు కూడా అధికారులు గుర్తించారు. కానీ చిరుత పులి ఆచూకిని గుర్తించి అడవుల్లోకి పంపేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానిక గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మారుమూల గ్రామాల్లో కొందరు వేటగాళ్లు వన్యప్రాణుల వేటనే ఉపాధిగా మార్చుకుంటున్నారు. రాత్రి వేళల్లో వన్యప్రాణులను హతమార్చి గుట్టుచప్పుడు కాకుండా మాంసాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. వర్షాకాల సీజన్ ప్రారంభమైనప్పటికీ అటవీ ప్రాంతంలో నీటి జాడలు లేక వన్యప్రాణులు అల్లాడుతున్నాయి. దాహం కోసం అడవుల నుంచి బయటకు వస్తున్న వన్యప్రాణులను మాటు వేసి హతమార్చుతున్నారు. అటవీ ప్రాంత సమీపంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నీళ్లను తాగేందుకు వస్తున్న దుప్పులు, జింకలు, కొండగొర్రెలు, మనుబోతులు వేటగాళ్ల ఉచ్చుకు చిక్కుతున్నాయి. రాత్రికి రాత్రే రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తు వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా కలప స్మగ్లింగ్ పైననే దృష్టి సారిస్తున్న అటవీ శాఖాధికారులు వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



సీతాగొంది అడవుల్లో వేటగాళ్లు హతమార్చినట్లు వైరల్ అవుతున్న నీలుగాయి దృశ్యం

- జిల్లాలో వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న వన్యప్రాణులు
- సీతాగొంది అడవుల్లో నీలుగాయిని చంపిన వీడియోల కలకలం
- అడవి జంతువుల సంరక్షణపై పట్టింపు కరువు
- ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్న అటవీ శాఖాధికారులు

సంరక్షణ చర్యలేవీ?

అటవీ పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో వన్యప్రాణులు సంచరిస్తున్న విషయాన్ని తెలుసుకుంటున్న వేటగాళ్లు మాటువేసి మరీ అంత మొందిస్తున్నారు. అడవి జంతువుల సంచారంపై అన్ని తెలిసినా అటవీ శాఖాధికారులు సంరక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అడవుల నుంచి జంతువులు బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మారుమూల గ్రామాల్లో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు రాత్రి వేళల్లో విద్యుత్ తీగలను అమర్చడంతో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌లోకి జనసంచారం పూర్తిగా నిషేధమైనా కలప స్మగ్లర్లతో పాటు ఇసుక మాఫియా సంచారం పెరిగిపోతునే ఉంది. సాధారణంగా వన్యప్రాణులు దాహం, ఆకలిని తీర్చుకునేందుకు నీటి జాడలను వెతుకుంటూ బయటకు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వేటగాళ్ల కంట పడి బలవుతున్నాయి. సరైన ఆహారం, నీటి వసతి, ఆవాసం కల్పించక పోవడంతోనే అడవుల నుంచి వన్యప్రాణులు తరచూ బయటకు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నా జిల్లా అడవుల్లో వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట పడడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

స్పెషల్ సర్కిల్ ఉన్నా..

వన్యప్రాణుల సంరక్షణకు 2014లోనే స్పెషల్ సర్కిల్‌ను ఏర్పాటు చేసి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అయినా వన్యప్రాణుల వేట ఆగడమే లేదు. ఏదైనా సంఘటన వెలుగులోకి వస్తేనే అధికారులు హడావిడి చేస్తున్నారు. యూడీఆర్ కేసులను నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు లేక పోలేదు. క్షేత్ర స్థాయిలో దర్యాప్తు జరిపితే వేటగాళ్ల ఆచూకీ తెలిసే అవకాశం ఉంటుంది. కానీ అధికారులు దర్యాప్తు పేరిట కాలయాపన చేయడంతో వేటగాళ్లను గుర్తించడంలో తీవ్ర జాప్యం జరుగుతునే ఉంది. బయట మార్కెట్లో వన్యప్రాణుల మాంసానికి భారీగా డిమాండ్ ఉండడంతో వేటగాళ్లు ముందస్తు ఆర్డర్లను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు జరుపుతున్నారు. అలాగే దుప్పి కొమ్ములు, పులి చర్మాలకు హైదరాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో డిమాండ్ ఉండడంతో వాటిని కూడా తరలిస్తూ అదనంగా దండుకుంటున్నట్లు తెలుస్తో ంది. వన్యప్రాణులు చనిపోయిన వాటి ఆనవాళ్లను భద్రపరిచే బాధ్యత డీఎఫ్‌వో, ఎఫ్‌డీవోలు తీసుకోవాలని 2018లోనే ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్‌ను జారీ చేసినా అది ఎక్కడా అమలైనట్లు కనిపించడం లేదంటున్నారు. అడపా దడపగా వేటగాళ్లపై కేసులు నమోదు చేస్తున్న సరైన ఆధారాలు చూపక పోవడంతో కోర్టులో కఠినమైన శిక్షలు పడడం లేదన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఉన్నత స్థాయి అధికారులను నియమించినా క్షేత్ర స్థాయిలో మాత్రం మార్పు కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎలాంటి ఆనవాళ్లు లభించడం లేదు

● పుండలిక్, ఎఫ్ఆర్‌వో, ఇచ్చోడ

సీతాగొంది అటవీ ప్రాంతంలో వేటగాళ్లు నీలుగాయిని చంపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకు ఎలాంటి ఆనవాళ్లు లభించడం లేదు. గత రెండు మూడు రోజులుగా అధికారులు టీంలుగా ఏర్పడి అటవి మారుమూల ప్రాంతాల్లోని గ్రామాల్లో ఆరా తీస్తున్నాం. ఎలాంటి సమాచారం రావడం లేదు. ఇదంతా ఎవరో కావాలని వైరల్ చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులు వారంలోగా చేరాలి

● జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్

ఉట్నూర్, జూన్26: లాటరీ పద్ధతిలో ఎంపికైన గిరిజన విద్యార్థులు వారంలోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లలో చేరాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల నుంచి లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోతరగతిలో 50 మందికి, ఐదోతరగతిలో 25 మందికి, ఎనిమిదో తరగతిలో 25 మందికి పారదర్శకంగా లక్కీలాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి ప్రవేశపత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, పీఎంఆర్‌సీ రిసోర్స్‌పర్సన్ గోవింద రావు, సెక్షన్ ఇన్‌చార్జి అనిల్‌లు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్అర్బన్,జూన్26: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు పక్కా భవనాలను ప్రభుత్వం నిర్మిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. బుధవారం వార్డునెంబర్ 12 పరిధిలోని ఆదిత్యనగర్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు రూ.20 లక్షల 25 వేలతో ప్రైమరీ పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలకు పక్కాభవనం కోసం కౌన్సిలర్ పవన్‌నాయక్ కృషిచేయడంతో కలెక్టర్ నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్ మాట్లాడుతూ ఆదిత్యనగర్‌లో ఇప్పటివరకు అద్దె భవనంలోనే ప్రైమరీ పాఠశాల కొనసాగిందన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల నుంచి రూ.20 లక్షల 25వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో భవన నిర్మాణానికి భూమిపూజ చేశామని, పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని గుత్తెదారుడికి సూచించడం జరిగిందన్నారు.

నీట్‌ను నిరసిస్తూ ఆందోళన

ఆదిలాబాద్ ఎంపీ ఇంటి ఎదుట ధర్నా

ఆదిలాబాద్అర్బన్,జూన్26:ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్‌పరీక్షలో అవకతవకలు జరిగాయని, దీనిపై పార్లమెంట్‌లో ఎంపీలు మాట్లాడకపోవడం సిగ్గుచేటని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఎంపీల తీరును నిరసిస్తూ బుధవారం ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ నివాసాన్ని ముట్టడించారు. పోలీసులు నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎంపీ ఇంటి ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. పోలీసులు నాయకులను అక్కడి నుంచి అరెస్టు చేసి, తీసుకువెళ్లే క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. చివరకు అరెస్టు చేసి విద్యార్థిసంఘాల నాయకులను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్‌రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నీట్‌పరీక్షను సవ్యంగా నిర్వహించలేదన్నారు. దేశవ్యాప్తంగా దీనిపై నిరసనలు కొనసాగుతున్న పార్లమెంట్‌లో ఏ ఒక్క ఎంపీ కూడా మాట్లాడడం లేదన్నారు. నీట్ పరీక్షలు ప్రారంభమైన నుంచి వంద శాతం మార్కులు ఎవరికి రాలేదన్నారు. తప్పిదాలను కప్పిపుచ్చేందుకు జూన్14న రావాల్సిన ఫలితాలను, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజు విడుదల చేసి విద్యా ర్థులను పక్కదారి పట్టించారన్నారు. నీట్‌ను రద్దుచేసి మళ్లీ నిర్వహించడంతో పాటు ఎన్‌టీఏపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

సిరికొండ, ఏప్రిల్ 26: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. బుధవారం సిరికొండ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ముందుగా శివాలయం రోడ్డుపనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. త్వరలో కల్యాణలక్ష్మి పథకం కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం శివాలయానికి రోడ్డు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వాయిపేట రోడ్డు సమస్యను త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల మృతి చెందిన ఆర్మీ జవాన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్మీ జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ విలాస్, ఎంపీపీ అమృత్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమామ్, రఘురాం, గ్రామపటేల్‌లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

● టీజీవీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

ఆదిలాబాద్అర్బన్,జూన్26:జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో అవినీతి రాజ్యమేలుతుందని, నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లోనే యూనిఫార్మ్, బుక్స్, బైలు బహిరంగంగానే అమ్ముతూ వేల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. విషయం తెలిసిన విద్యాశాఖాధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలలకు తోకపేర్లు మెమోరియల్, టెక్నో, కాన్సెప్ట్ ఈ టెక్నో, పబ్లిక్, మోడల్, గ్లోబల్ యూనివర్సల్ వంటివి నిషేధం ఉన్నా బహిరంగంగానే అనేక పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. అలాగే మెజార్టీ పాఠశాలలు ప్రభు త్వ నిబంధనల మేరకు నడవడం లేదని, వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే ఉన్నత విద్యాధికారులు స్పందించి అన్ని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇందులో పట్టణ, బోథ్ నియోజక వర్గ కన్వీనర్ గొర్లనరేందర్, కో-కన్వీనర్ సతీష్, సాయి, గణేష్, పవర్, అఖిల్, జాదవ్ కళ్యాణ్, చౌహాన్ విశాల్, కార్తిక్ తదితరులున్నారు.

వర్షాలతో విద్యుత్ శాఖకు రూ.10 లక్షల ఆస్తి నష్టం

బోథ్,జూన్ 26 : ఇటీవల ఈదురుగాలులతో కురిసిన వర్షం వల్ల విద్యుత్ శాఖకు రూ.10 లక్షల మేరకు నష్టం సంభవించిందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేష్ తెలిపారు. అయితే గతంలో వేసిన విద్యుత్ స్తంభాలను సరిచేయ డం జరిగిందని ఆయన అన్నారు. విద్యుత్ కోతలు ఉండకుండా ముందస్తుచర్యలు తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.. తరుచుగా విద్యుత్ కోతలు విధిస్తున్న విషయమై వివరణ అడుగగా విద్యుత్ లైన్‌లలో ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ప్రభుత్వం నుంచి విద్యుత్‌కోత విషయమై ఎలాంటి ఆదేశాలు లేవని ఏఈ స్పష్టం చేశారు. అయితే తమ సిబ్బంది సైతం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేస్తుందని ఆయన వివరించారు. విద్యుత్ కోతలు ఉండవని, నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కుంటాల జలపాతం అభివృద్ధికి కృషి : కలెక్టర్ రాజార్షిషా



హరిత హోటల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- పనుల పరిశీలన
- పర్యాటకుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశం

నేరడిగొండ, జూన్26:కుంటాల జలపాతం అభివృద్ధి కోసం కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. డీఎఫ్ఓ, ఐటీడీఏ పీవోలతో కలిసి బుధవారం మండలంలోని కుంటాల జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జలపాతం వద్ద గల వసతులు పరిశీలించారు. జలపాతం వద్ద మొక్కలు నాటిన అనంతరం హరిత హోటల్ నిర్మాణస్థలాన్ని పరిశీలించారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందని గ్రామస్థులు తెలుపగా, త్వరలోనే ఒక నిర్ణయానికి వచ్చి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ అన్నారు. అడవి మధ్యలో హరిత హోటల్‌నిర్మాణం చేపడతామని డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీ రావ్ పాటిల్ అనగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టైగర్‌జోన్‌లో అడవి ఉన్నందున పర్యాట కులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. రూ.3 కోట్ల 81 లక్షలతో హోటల్, కాటేజ్, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా టెండర్ సైతం అయిందని, వెంటనే నిర్మాణం పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. పర్యాటకుల సౌకర్యాల కల్పనకు స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని, వర్షాకాలంలో జలపాతంలో వరద నీరు అధికంగా చేరడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావ్, ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వో గణేష్, ఎంఆర్ఐ నాగోరావ్, ఎంసీ శంకర్, ఎఫ్ఎస్‌వో వసంత్‌కుమార్, ధన్‌సింగ్, ఏసీ సుధాకర్, శేఖర్, ఎఫ్ బీవో సచిన్, గ్రామస్థులు తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన కలెక్టర్

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'జలపాతాల వద్ద జరజాగ్రత్త' కథనానికి కలెక్టర్ రాజార్షిషా, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్‌పాటిల్‌లు స్పందించి బుధవారం కుంటాల జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ఆర్డీవో వినోద్‌కుమార్, ఈఈ భీంరావ్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం : ఆదిలాబాద్ ఎస్పీ


ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ, పోలీసులు

ఆదిలాబాద్అర్బన్,జూన్26:మత్తు పదార్థాల వినియోగం వల్ల చదువు, భవిష్యత్తు నాశనమవుతాయని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా దినం సందర్భంగా కలెక్టర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ డీసీఆర్‌బీ కె.సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ బి.సురేంద్రరావు, డీఎస్పీలు ఎన్.జీవన్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, డీడబ్ల్యు సబిత, డీసీపీఓ రాజేంద్రప్రసాద్, మిషన్ కో-ఆర్డినేటర్ యశోద, సఖీ నిర్వాహకురాలు సరస్వతి, నలంద కళాశాల, విద్యార్థి కళాశాల, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, ఎన్‌సీసీ విద్యార్థులు, కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోనాల:బోథ్ పోలీసు ఆధ్వర్యంలో సోనాల గ్రామంలో బుధవారం రోజున బస్టాండ్ వద్ద మాదకద్రవ్యాల నివారణ వాటి వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు యువకులకు ఎస్సై రాములు అవగాహన కల్పించారు.

ఆదిలాబాద్అర్బన్:ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి మిషన్ పరివర్తన్ అవగాహన వాక్‌ను చేపట్టారు. ఈ వాక్‌లో అద నపు ఎస్పీ సురేందర్‌రావు పాల్గొని ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శి నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్‌చౌక్ మీదుగా సాగి తిరిగి స్టేడియానికి చేరుకుంది. డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, సీఐలు పాల్గొన్నారు.

ఇచ్చోడ: యువత డ్రగ్స్ బారినపడి విలువైన జీవితాన్ని బలిచేసుకోవద్దని ఇచ్చోడ సీఐ భీమేష్ సూచించారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, ఏఎస్సై లింబాజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్యత్ అంధకారమవుతుందని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. కార్యక్రమంలోఎస్సై దుబ్బాక సునీల్, హెడ్ కానిస్టేబుల్ అఫ్సర్ పాల్గొన్నారు.

బోథ్: మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటుందని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోథ్ సీఐ రమేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సై రాము, మార్కెట్‌కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ జి.రాజు యాదవ్, వీడీసీ చైర్మన్ జి.గంగాధర్, సామాజిక సేవకులు మాసం అనిల్, ఎంపీడీవో రమేష్, ఉపాధి హామీ ఏపీవో జగదేవరావు, డిప్యూటీ రేంజ్ అధికారి సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్:యువత చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గాన్ని ఎంచుకోవాలని బోథ్ సీఐ రమేష్ పేర్కొన్నారు. బుధవారం డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దేగామ గ్రామంలో యువతకు అవగాహన కల్పించారు. అనంతరం మండలకేంద్రంలో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో అధికారులు, మండల యువజన సంఘాలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.

దిలావర్‌పూర్:మాదక ద్రవ్యాల అలవాటు సామాజిక, మానసిక, శారీరక ఆరోగ్యానికి చేటని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే.శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, జూన్ 26 : రైతు బంధు పథకం ద్వారా పెట్టుబడి సహాయాన్ని వెంటనే అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. బుధవారం మండలంలోని చర్లపల్లి, మందగూడ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం రైతులకు రైతు బంధు డబ్బులు ఇంకా అందించడం లేదన్నారు. ఈయన వెంట సహకార సంఘం చైర్మన్ వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పిడుగు సంజీవరెడ్డి, ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, రమాకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీంపూర్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుహామీలను నెరవేర్చాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో అంగడి బజార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఎంపీపీ కుడిమేత రత్నప్రభ సంతోష్, జడ్పీటీసీ కుంరా సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్నలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

తాంసి:ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడుస్తున్నా తులం బంగారం జాడలేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ అన్నారు. బుధ వారం తాంసి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పదిమందికి కళ్యాణలక్ష్మీ చెక్కులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ తాటిపల్లి రాజు, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేఖ, రఘు, సూపరింటెండెంట్ రవీందర్ పాల్గొన్నారు.

‘రేవంత్ ప్రభుత్వానికి ధన్యవాదాలు’

ఇంద్రవెల్లి, జూన్ 26 : ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చూపిన చొరవతో సుదీర్ఘమైన సమస్యలు పరిష్కరించారని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించినందుకు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి సీఎంకు, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘ సమస్యను పరిష్కరించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు ఆదివాసీ గిరిజన ఉపాధ్యాయులు, టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు జ్ఞానేశ్వర్, వెంకటేష్, రాథోడ్ వికాస్, పీఎస్‌హెచ్‌ఎం ఆడే రాజేశ్వర్, సీఆర్టీ ప్రతినిధి సుంకే చందు, రాథోడ్ సురేఖ, ఎస్జీఆర్టీ దుర్వ జంగు, సీఆర్టీ రాథోడ్, గణేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల ఆందోళన

ఆదిలాబాద్ రూరల్, జూన్ 26 :కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్య క్షులు బొజ్జ ఆశన్న, జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ సభ్యుడిగా నర్సింలు

తలమడుగు, జూన్ 26 : ప్రజా శ్రేయస్సు కోసం ప్రజల హక్కుల కోసం (అస్రా) అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్ చీఫ్ హబీబ్ సుల్తాన్ అలీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నడుస్తున్న కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఆదిలాబాద్ జిల్లా సభ్యుడిగా తలమడుగు మండల వాసి రుయ్యాడి గ్రామానికి చెందిన సామాజిక సేవకులు జువ్వాక నర్సింలును నియమించారు. ఆ నియామక పత్రాన్ని ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడికి అందజేయడం జరిగింది.

విదేశీ కరెన్సీ, నాణాల ప్రదర్శన

సోనాల, జూన్26: సోనాల మండలంలోని గుర్రాల తండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం 40 దేశాల కరెన్సీ, నైజాం, బ్రిటిష్ కాలంలో చెలామణి అయిన నాణెలు, మొగల్ పాలకుడు అక్బర్ కాలపు రాగి నాణేలు, ఆయా సందర్భాలలో మహనీయుల జయంతి, వర్ధంతిలలో విడుదల చేసిన అరుదైన నాణెలు ప్రదర్శించడం జరిగింది. వీటిని అలవాటుగా సేకరించి ప్రదర్శనకు ఉంచిన భాశెట్టి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన వల్ల విద్యార్థులకు విషయపరిజ్ఞానం వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు పసుల గంగాధర్, ఉపాధ్యాయురాలు జి.సవిత, పలువురు పాల్గొన్నారు.

‘నాటిన మొక్కను సంరక్షించాలి’

తలమడుగు, జూన్ 26 : నాటిన మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. బుధవారం మండలంలోని బరంపూర్ కమ్యూనిటీ ప్లాంటేషన్స్ ద్వారా చేపడుతున్న మొక్కల స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీలో 28 నర్సరీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి నర్సరీలో పది వేలుపైగా మొక్కలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జూలై మొదటి వారం నుంచి మొక్కలను నాటేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు. ప్రతి ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ చేసేందుకు మండలంలో దాదాపు మూడు లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయుల పోస్టుల మంజూరుకు ఆదేశాలపై హర్షం

ఉట్నూర్,జూన్26:గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల కోసం జీవో 16 విడుదలకు కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయ పోస్టుల మంజూరుకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డీవీ రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో కలిసి కృతజ్ఞతలు తెలుపడంతో పాటు పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ డీఈఓలు, ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, బీఎడ్ కాలేజిలు, పీటీసీలు, డీఎడ్, జూనియర్ కాలేజీలలో లెక్చరర్ల పోస్టుల మంజూ రుకు ప్రయత్నిం చాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, అసోసియేటెడ్ అధ్యక్షులు బయన్న, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఇస్లావత్‌వీరన్న,గజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం కార్యదర్శి చందన్, సారయ్య దొర, లింగస్వామి, దేవరావు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న గెజిటెడ్ హెచ్‌ఎంల జోనల్‌స్థాయి సవరించిన సర్వీస్ రూల్స్ ఫైల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంత్రి సీతక్క మాట్లాడి ఆమోదింప చేసి మంగళవారం జీవో 16ను ఎట్టకేలకు విడుదల చేయించడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

‘ప్రజలకు అందుబాటులో ఉండేందుకే మీ సేవ కేంద్రాలు’

నేరడిగొండ,జూన్26:ప్రజలకు అందుబాటులో ఉండేందుకే మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీఎం ఉత్తం అన్నారు. బుధవారం మండలంలోని బుగ్గారం వడూర్ గ్రామాలలో నూతనంగా ఏర్పాటైన మీ సేవ కేంద్రాలను నడిపేందుకు నిర్వహకులను ఐకేపీ ఆధ్వర్యంలో ఎన్నుకునేందుకు దరఖాస్తులను స్వీకరించారు. బుగ్గారంలో జాదవ్ సోనిని నియమించగా వడూర్‌లో ఎక్కువ దరఖాస్తులు రావడంతో వాయిదా వేశారు. ఇందులో ఆయా గ్రామాల సీసీలు గ్రామైక్య సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో కుండపోత వర్షం

ఇచ్చోడ, జూన్, 26: ఇచ్చోడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అరగంట నుంచి గంట సేపట్లోనే కొన్ని ప్రాంతాల్లో కుండపోతగా కురవడంతో వరద పోటెత్తింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వరదనీరు భారీగా చేరడంతో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తంతా రోడ్లపై పారడంతో గంటలపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో నాలాలు పొంగిపోవడంతో రహదారులపై వరద నీరు ప్రవహించింది.

‘రోడ్లను, మురికి కాలువలను నిర్మించండి’

బోథ్, జూన్ 26 : మండల కేంద్రంలో మంచినీటి సరఫరాకు తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం జరిగిన గ్రామసభకు సెక్రెటరీ అంజయ్య అధ్యక్షత వహించగా ఎంపీడీవో రమేష్, ఉపాధిహామీ ఏపీవో జగదేరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డుగంగారెడ్డి, ఎంపీటీసీ కురుమే మహేందర్, వీడీసీ అధ్యక్షులు జి.గంగా.దర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని మిషన్ భగీరథ ద్వారా వేసిన పైప్‌లైన్లను మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిజనవాడ పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలన్నారు. వర్షాకాలం నీరు నిలుస్తుందని, ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కలెక్టర్‌కు వినతి

ఇచ్చోడ, జూన్, 26: మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలో చేసిన ఆయా పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని మండల మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు బుధవారం ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాజార్షిషాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పల్లెప్రకృతి వనాలు, శ్మశానవాటికలు, సీసీ రహదారులు, మురుగు కాల్వలు తదితర చేసిన పనులు, నిధులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు లక్షల్లో ఉన్నాయని, 15 రోజుల్లో బిల్లులు విడుదల అయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. లేని యెడాల రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపడతామని మండల మాజీ సర్పంచులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అడవ్ మారుతీ, అంకుష్, సుభాష్, మల్టీపర్పస్ వర్కర్లు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

‘బ్యాంకు ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తాం’

బోథ్, జూన్ 26 : బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందించడంలో తాము ముందు ఉంటామని ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఖాతాదారులను చూసుకుంటామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన యూనియన్ బ్యాంకుమేనేజర్ పేర్కొన్నారు. బుధవారం నూతన చైర్మన్‌ను కలిసిన బోథ్‌మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి సహకార సంఘం డైరెక్టర్ జి.రాజు యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకును అన్ని రంగాల్లో ముందించేందుకు ఖాతాదారుల సహకారం అవసరమన్నారు. బ్యాంకు అన్ని విధాలుగా ముందుండాలంటే ఖాతాదారులతో పాటు ప్రజలు నాయకుల సహకారం ఉండాలన్నారు. మహిళా సంఘా లు తీసుకున్న రుణాలను చెల్లించినట్లయితే మరింత రుణం పెంచి ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జనరల్ సెక్రటరీ రాజు పాల్గొన్నారు.


ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

ఉట్నూర్,జూన్26:ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువకులు ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ విద్యార్థులకు అవకాశం కల్పించడం జరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగంతో పాటు ఉచితంగా డిగ్రీచేసే అవకాశం ఉందన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ బ్రిడ్జి కోర్సుతో ఇంటర్మీడియట్ చేసిన నిరుద్యోగ గిరిజన యువకులకు ఎంఎస్ఎన్ లాబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఉద్యోగంతో పాటు టీఐఎస్ఎస్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ చదువుకునే అవకాశం ఉందన్నారు. గురువారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.


విద్యాసంస్థల బంద్ సక్సెస్

ఆదిలాబాద్ అర్బన్,జూన్26: ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఇచ్చిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ప్రైవేట్ పాఠశాలలు ముందుగానే సెలవును ప్రకటించాయి. బుధవారం సంజయ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు, పాఠ్యపుస్తకాల పేరిట తలిదండ్రుల నుంచి అధిక డబ్బులను తీసుకుంటున్నారన్నారు. యూనిఫామ్స్, బుక్స్ విక్రయాలతో వ్యాపారాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిర సిస్తూ చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.7 : కనిష్ఠం 26.3
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 27 జూన్ 2024



బాసర ట్రిపుల్ ఐటీలో.. మళ్లీ టెన్షన్



- యూనియన్ ఏర్పాటు కోసం విద్యార్థుల పట్టు
- అడ్డుకుంటున్న అధికారులు
- గతంలో మాదిరి ధర్నా చేస్తారేమో అని అధికారుల ఆందోళన
- సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేసి తీరుతామని విద్యార్థుల స్పష్టం

బాసర, జూన్, 26 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో మళ్లీ టెన్షన్ మొదలైంది. సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసుకుంటామని విద్యార్థులు దరఖాస్తు పెట్టు కోవడం చర్చకు దారి తీసింది. అధికారులు మాత్రం విద్యార్థుల నిర్ణయా నికి ససేమిరా అంటున్నారు. ఒకపక్క దరఖాస్తు తీసుకుంటూనే మరో పక్క విద్యార్థులపై కమిటీని ఏర్పాటు చేసుకోకుండా ఒత్తిడి పెంచుతు న్నట్లు తెలుస్తుంది. రెండేళ్ల క్రిందట గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలాది మంది విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు విద్యార్థుల కమిటీ అనగానే యూని వర్సిటీ అధికారులకు అప్పటి రోజులు గుర్తుకువస్తున్నాయి. ఆందోళన చేస్తారేమోనని భయం పట్టుకుంది. అందుకే విద్యార్థుల కమిటీ ఏర్పడ కుండా అడ్డుకుంటున్నారు. యూనివర్సిటీ సిబ్బందితో విడివిడిగా విద్యా ర్థులపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం అందుతోంది. ఈ నెల 22వ తేదిన విద్యార్థులు సమావేశమై యూనివర్సిటీలో అపరిష్కృతమైన సమ స్యలపై చర్చించారు. వాటి పరిష్కారం కోసం అధికారులకు, విద్యార్థుల కు వారధిగా ఉండేలా ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయిం చారు. అదే రోజు అనగా ఈ నెల 22వ తేదీన విద్యార్థులందరూ కలిసి యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారికి దరఖాస్తు ఇచ్చారు. మళ్లీ మంగళవారం మరోసారి సదరు అధికారిని కలిశారు. ఆయన నుంచి స్పందన రాకపోవడంతో సుమారు 100-150 విద్యార్థుల బృందం యూని వర్సిటీ స్పెషల్ ఆఫీసర్ వద్దకు వెళ్లి విన్నవించుకున్నారు. కమిటీ ఏర్పా టుకు అధికారులు నిరాకరిస్తున్నట్లు సమాచారం. అంతేగాక యూని వర్సిటీలోని కీలక అధికారులతో ఒత్తిడి తెప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్టూడెంట్ కౌన్సిల్ నిర్వీర్యం

యూనివర్సిటీలో స్టూడెంట్ గవర్నింగ్ కౌన్సిల్ (ఎస్‌జీసీ) ఉండేది. విద్యార్థులే ఈ గవర్నింగ్ కౌన్సిల్‌ను ఎన్నుకొని అధికారులకు తెలియ జేసేది. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధి కారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించే ందుకు కృషి చేసేది. రెండేళ్ల క్రిందట ఈ కౌన్సిల్ ఆధ్వర్యంలోనే విద్యార్థులు పెద్ద ఎత్తున సమస్యలపై పోరాటం చేశారు.. వారం రోజుల పాటు సుమారు 8 వేల మంది విద్యార్థులు ఎండ, వాన, రాత్రి పగలు అని లెక్క చేయకుండా యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం పోలీసు వలయాన్ని తప్పించు కొని ప్రహరీగోడ దాటి ఆందోళన చేస్తున్న అప్పటి విద్యార్థులకు మద్దతు పలికారు. ఆ తర్వాత అప్పటి ప్రభుత్వం ఆందోళన చేసిన విద్యార్థులపై అణగ దొక్కే చర్యలు చేపట్టింది. విద్యార్థులపై నాన్-బెయిల బుల్ కేసులు నమోదు చేయించి స్టూడెంట్ గవర్నింగ్ కౌన్సిల్‌ను నిర్వీ ర్యం చేశారు. ఆ తర్వాత గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు కోసం విద్యార్థులు అనేక సార్లు అధికారులకు విన్నవించారు. అయినా అధికారులు అందు కు అంగీకరించకపోవడంతో మళ్లీ తాజాగా విద్యార్థులు ఇప్పుడు కమిటీ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి అధి కారుల దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న విషయం వాస్తవమేనని అది ఉన్నత అధికారుల పరిశీలనలో ఉందని సమాధానం ఇచ్చారు.

అధికారుల చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసే కమిటీకి సంబంధించి విద్యార్థులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పలుమార్లు విద్యార్థి విభాగ అధికారులతో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారు లను కలిసి విన్నవించారు. యూని వర్సిటీలో నెలకొన్న స మస్యల గురించి చర్చించుకోవడానికి సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి అను మతి ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వైస్ ఛాన్సలర్ ఇన్‌చార్జీ కావడం, ఆయన హైదరాబాద్‌లో ఉండడం ఇవే కారణాలు చూపుతూ క్షేత్రస్థాయి అధికారులు విద్యార్థులను పంపించేస్తున్నారు. ఈ నెల 22, 24వ తేదీ, 25, 26 తేదీల్లో విద్యార్థులు అధికారులతో చర్చిం చారు. గతంలో ముందుండి సమస్యల పరి ష్కారం కోసం పోరాడిన 4-5 గురు మంది కీలక విద్యార్థులపై కేసులు నమోద వడంతో ఈ సారి విద్యార్థులు అలా జరగకుండా సుమారు 100 మంది విద్యార్థులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రతీసారి అధి కారుల వద్దకు వెళుతున్నారు.


కమిటీ ఏర్పాటు కోసం స్పెషల్ ఆఫీసర్‌ను కలిసేందుకు వచ్చిన విద్యార్థులు

నెరవేరని అప్పటి హామీలు

2022 జూలై నెలలో విద్యార్థులు వారంరోజుల పాటు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించి విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించేందుకు అంగీకరించారు. అ సమయంలో ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరలేదు. రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియామకం.. అధ్యాపక సిబ్బంది ఖాళీల భర్తీ, ఆసుపత్రిలో మౌలిక వసతులను మెరుగు పరచడం, యూనివర్సిటీలో క్యాంటీన్‌కు టెండరు వేయడం, ఐసీటీ ఆధారిత విద్యాబోధనను తిరిగి అమలు చేయాలని, ఫీజు రీయంబర్స్‌మెంట్, మౌలిక వసతుల ఏర్పాటు వంటి హామీలు నేటికి అమలు కాలేదు. సమస్యలు సమస్యలుగానే మిగిలిపోయాయి. దీనికి తోడు కొత్త సమస్యలు ఏర్పడ్డాయి. గత ఏడాది విద్యా సంవత్సరం ము గిసిన విద్యార్థులకు యూనిఫామ్స్, హాస్టల్‌లలో బెడ్స్ వం టివి అందలేదు. కనీసం విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి నుంచి తీసుకవచ్చిన ఆహారాన్ని సైతం విద్యార్థు లకు అందివ్వకుండా అధికారులు నిబంధనలు విధిం చారు. ఇలా అనేక సమస్యలు ట్రిపుల్‌ఐటీలో నెల కొన్నాయి. వీటిని పరిష్కరించు కోవడానికి విద్యా ర్థులు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


తరగతులు బహిష్కరించిన విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, జూన్ 26 : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలలు బంద్ పాటించాయి. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై 15 రోజులైనా పుస్తకాలు. దుస్తులు అందించలేదని నాయకులు ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారని వాటిపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిందని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధ్యక్షుడు శివ కుమార్, దినేష్, దీపక్, జీవన్, మనోజ్, నరేందర్, నితీష్, ఆకాష్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా భైంసా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా రూరల్, జూన్ 26 : భైంసా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు రజాక్ అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ తమ నివేదికను చదివి వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ అన్ని గ్రామాలలో త్రాగునీటి, విద్యుత్ సమస్యలు అతి తొందరగా పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, విద్యుత్ ఏఈ నాగేంద్రప్రసాద్ శ్రీకాంత్, ఎంపీవో మోజాం హుస్సేన్, చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గజేందర్, వైస్ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నిర్మల్ కల్చరల్, జూన్ 26 : ఎన్నికలై ఆరు నెలలైనా గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోవడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా పనిచేసే 1400ల మంది కార్మికులకు పదకొండు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. మల్టీ పర్పస్ విధానం రద్దు సమస్యతో పాటు పలు దీర్ఘకాల సమస్యలపై మంత్రి సీతక్కకు విన్నవించినా ఫలితం లభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రం అందజేయగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు వెంకటయ్య, బి. సురేష్, గ్రామ పంచాయతీ సంఘం అధ్యక్షుడు నర్సయ్య, శేఖర్, పోశెట్టి, లింగన్న, విలాస్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

'ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టండి'


కుమరం భీం చౌరస్తాలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, జూన్ 26 : పట్టణ శివారులోని కొమురం భీం చౌరస్తాలో జరుగుతున్న హైవే రోడ్డు పనుల వద్ద ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం నేషనల్ హైవే రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ కాలనీకి వెళ్లే మూలమలుపు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని నేషనల్ హైవే అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు నాయిని సంతోష్, పరిమి సురేష్, అమానుల్లా ఖాన్, కిషోర్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మున్సిపాలిటీ ఏఈ తిరుపతి, నేషనల్ హైవే అధికారులు, తదితరులున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి


భోజన్న మృతదేహం

భైంసా రూరల్, జూన్ 26 : మండలంలోని లింగా గ్రామం వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మాలేగాం గ్రామానికి చెందిన భోజన్న(40) భైంసాకు వస్తున్న సమయంలో సౌలీ గ్రామానికి చెందిన పురాడి అక్షయ్ ఇంటికి వెళ్లే సమయంలో లింగా గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో భోజన్న ఘటనస్థలంలో మృతి చెందగా అక్షయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి తోకల శివన్న పిటిషన్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

'ఎంపీపీపై అక్రమ కేసును ఎత్తివేయాలి'


ఎంపీపీకి మద్దతుగా మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షురాలు పసుల మౌనిక

కుంటాల, జూన్, 26 : ఇటీవల కుంటాల మండలంలో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి శృతి విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని ప్రశ్నించిన ఎంపీపీ అప్క గజ్జారంపై కేసు నమోదు చేయించారని ఈ కేసు వెంటనే ఎత్తివేయాలని మండల ఉపాధ్యక్షురాలు పసుల మౌనిక నవీన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం కుంటాలలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వైద్యాధికారిపై ఇది వరకే పలువురు ప్రజా ప్రతినిధులు పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందని ఎంపీపీ కూడా గత ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని అయినా ఆమెలో ఎలాంటి మార్పు రాలేదని పేర్కొన్నారు. ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహిస్తే ప్రజాప్రతినిధులు ఎందుకు ఫిర్యాదులు చేస్తారని ప్రశ్నించారు. ఆమె గత కొంతకాలం నుంచి సక్రమంగా విధులు నిర్వహించకుండా ఆసుపత్రిని కమిటీ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నప్పటికీ ఇలాంటి సిబ్బంది మూలంగా లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ఎంపీపీ పేద ప్రజలకు వైద్యసేవలు సరిగ్గా అందడం లేదనందుకే కేసు నమోదు చేయించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇకనైనా ఎంపీపీపై పెట్టిన కేసును ఎత్తివేయని పక్షంలో ఎంపీపీ తరఫున నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సవిత మోహన్, దాసరి మధు, కట్ట రవి, సత్యం సునంద గిరీష్ తదితరులు ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


బాసర ట్రిపుల్ ఐటీలోవిద్యార్థుల మానవహారం


మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ టౌన్, జూన్ 26 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు, పోలీసులు, పట్టణ పుర ప్రముఖులు, విద్యాశాఖ, ఐసీడీఎస్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో నిర్వహించిన ఈ ర్యాలీ 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం యువతను కాపాడుదాం' డ్రగ్స్‌ను పక్కన పెట్టు జీవితాన్ని గాడిలో పెట్టు' అనే నినాదాలతో సాగింది. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలకు అలవాటు పడడం వలన శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పాఠశాల, కళాశాలల స్థాయి నుంచి విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మాదక ద్రవ్యాల అమ్మకం, వినియోగం గురించి తెలిస్తే వెంటనే పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి పోస్టర్లను అధికారులు, యువతతో కలిసి అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అధికారులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, డీడబ్ల్యూవో నాగమణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధనరాజ్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, రెవెన్యూ, తహసీల్దార్లు రాజు, సంతోష్, రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు, విద్యార్థులు, ఆశాకార్యకర్తలు, ప్రజలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలి : ఎస్పీ జానకి షర్మిల

బాసర : డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు పోరాడాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం బాసర ట్రిపుల్ ఐటీలో ప్రపంచ డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్ దుష్పరిమాణాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, అనారోగ్యాల గురించి వివరించారు. ఒక్కసారి అలవాటు పడితే యువత అందమైన భవిష్యత్తు మత్తు అనే అంధకారంలోకి వెళుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యాంటీ డ్రగ్ ఆకారంలో మానవహారాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్, ట్రిపుల్ సీఐ రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను పారద్రోలేందుకు ప్రజలు సహకరించాలి : సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్ టౌన్ : మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీసుస్టేషన్ నుంచి ఆర్డీవో కార్యాలయం, చైన్‌గేట్ మీదుగా శివాజీచౌక్ వరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజంలో డ్రగ్స్‌ను పారద్రోలేందుకు ప్రజలు సహకరించాలని, యువత డ్రగ్స్ బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా రవి ఉన్నత పాఠశాల నుండి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్‌రెడ్డి విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. రవి ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

భైంసా : ఉజ్వల భవిష్యత్తు కోసం యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువత డ్రగ్స్ కు అకర్షితులైతే ఆరోగ్యాన్ని, వ్యక్తిగతంగా కోలుకోలేని రీతిలో నష్టపోవాల్సి వస్తుందన్నారు. డ్రగ్స్‌తో పాటు గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరేట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని వివిధ విద్యా సంస్థల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు.

అక్రమ డి-1 పట్టాలను రద్దు చేయాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన గ్రామస్థులు

మామడ, జూన్ 26 : అక్రమ డి-1 పట్టాలను చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, వాటిని వెంటనే రద్దు చేయాలని మామడ మండలంలోని

తహసీల్దార్ కార్యాలయం ఎదుట న్యూ సాంగ్వి గ్రామస్థుల ఆందోళన

న్యూ సాంగ్వి గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందర ధర్నాగా బైఠాయించారు. ఈ సందర్భంగా వారు కొందరు ముఠాగా ఏర్పడి భూ నిర్వాసితులకు కేటాయించిన డి-1 పట్టాలను వేరే వారు అక్రమంగా వారిపై చేసుకోవడం దారుణమని, వీటికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు వాటికి సపోర్ట్ చేసే దొంగ పట్టాలను ఆపేయాలని కోరారు. లేనియెడల భారీ ఆందోళన చేస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సుధాకర్, ఆందోళన కారులను శాంతింపజేసి అక్రమంగా పట్టాలను చేసుకున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఎం. గంగాధర్, అలకుంట రాజేందర్, భూమన్న, మహేష్, హరి, వికాస్ రెడ్డి, సంతోష్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సాఫీగా సర్వసభ్య సమావేశం

సారంగాపూర్, జూన్ 26 : మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం మండల ఎంపీపీ సావితబాయి అధ్యక్షతన సాఫీగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా చించోలి(బి) ఎంపీటీసీ వెంకట రమణారెడ్డి గ్రామంలో ప్రతీరోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సభలో వెల్లడించారు. దీంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాఠశాలలకు అమ్మ పాఠశాలల పేరుతో నిధులు మంజూరయ్యాయని వాటి మరమ్మతుల పనులు చేపట్టామని, సహకాలంలో పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ ఏఈ సభలో వెల్లడించారు. అనంతరం ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో జడ్పీ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మిని జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డితో పాటు ఎంపీటీసీలను శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సొసైటీల చైర్మన్లు నారాయణ్ రెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు, తహసీల్దార్ శ్రీదేవి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

.. కుంటాలలో బహిష్కరణ

కుంటాల, జూన్, 26 : మండల కేంద్రం కుంటాలలో బుధవారం కుంటాల మండల సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. సమావేశం ప్రారంభంకాగానే ఓలా ఎంపీటీసీ కట్ట రవి ఇటీవల పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ అప్క గజ్జారాం వైద్యాధికారి శృతి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని అన్నందున అతనిపై అక్రమ కేసు నమోదు చేయడం జరిగిందని అందుకు నిరసనగా ఈ మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో సభ్యులందరూ బయటకు వెళ్లిపోయారు.

చేపల వేటకు వెళ్లి గోదావరిలో మునిగి బాలుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లింబాద్రి

ఖానాపూర్, జూన్ 26 : చేపల వేటకు వెళ్లి 16 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఘటన ఖానాపూర్ మండలం బావాపూర్(కే) గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... బావాపూర్(కే) గ్రామానికి చెందిన పడాల గంగ నర్సయ్య కుమారుడు నాగరాజు(16) అనే బాలుడు బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో చేపలు పట్టేందుకని గోదావరి నదిలకి వెళ్లాడు. గోదావరి నదిలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నాగరాజు నీటిలో పడిపోయాడు. నీటిలో మునిగిపోయిన నాగరాజు ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్థుల సహాయంతో మృత దేహాన్ని బయటకు తీశారు. ఈ విషయమై మృతుడి తండ్రి గంగ నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.